అమరావతికి డిఎస్‌సి అభ్యర్థుల పయనం

ప్రజాశక్తి-కడప అర్బన్

ఉమ్మడి కడప జిల్లా నుంచి ఎంపికైన డిఎస్‌సి అభ్యర్థులు 869 మంది కాగా అందులో 820 మంది, 122 స్టాఫ్,15 మంది పోలీసుల భద్రతతో కలెక్టరేట్ ప్రాంగణం నుంచి ఉదయం 9:40 గంలకు 43 ఆర్టీసీ బస్సుల్లో అమరావతికి బయలుదేరి వెళ్లారు. బుధవారం డిఆర్‌ఒ విశ్వేశ్వర నాయుడు జెండా ఊపి ప్రారంభించారు. ఈ నెల 25న మధ్యాహ్నం 2.30 గంటలకు అమరావతి సెక్రటేరియట్ ప్రాంగణంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ చేతులు మీదుగా నియామక పత్రాలు అందుకోనున్నారు. కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, జాయింట్ కలెక్టర్ అదితిసింగ్, డిఆర్‌ఒ విశ్వేశ్వర నాయుడు ఎంపిక ప్రక్రియకు పూర్తి సహాయ సహకారాలు అందించినందుకు ఉమ్మడి జిల్లా విద్యాశాఖ అధికారులు కృతజ్ఞతలు తెలిపారు. ఎంపికైన 869 మంది అభ్యర్థుల్లో 637 మంది స్కూల్ అసిస్టెంట్లు, ఎస్‌జిటిలు ఉండగా, మిగిలినవారు టిజిటి, పిజిటిలు ఉన్నారు. డిఎస్‌సి అభ్యర్థులతో పాటు వారి కుటుంబ సభ్యులు కూడా ప్రత్యేక బస్సుల్లో అమరావతికి వెళ్లారు.

యూరియా వెతలు

- పిఎసిఎస్‌లు, గ్రోమోర్ సెంటర్లకు పోటెత్తిన రైతులు
- అరకొరగా ఎరువుల పంపిణీపై ఆగ్రహం
- జిల్లాకు యూరియా వచ్చినా సరిపోని వైనం
- పట్టించుకోని వ్యవసాయ, మార్క్‌ఫెడ్ అధికారులు
- వచ్చిన యూరియా ఎటు మళ్లించారో తెలియని స్థితి

గ్రోమోర్ సెంటర్ వద్ద యూరియా కోసం వేచి ఉన్న రైతులు

జిల్లాలో యూరియా కొరత తీవ్రంగా ఉంది. పిఎసిఎస్‌లు, గ్రోమోర్ సెంటర్లకు బుధవారం రైతులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే క్యూలైన్లలో గంటలతరబడి నిలబడ్డారు. తీరా అందుకునే సమయానికి ఎకరాకు బస్తాకు మించి ఇవ్వబోమని ఆంక్షలు పెట్టడంతో రైతులు ఎదురుతిరిగారు. పిఎసిఎస్‌లకు వచ్చిన యూరియాను ఎక్కడికి తరలించారని, బస్తా ఇస్తే ఏం చేసుకోవాలని వాగ్వాదానికి దిగారు. కాంప్లెక్స్ ఎరువులు చల్లాలంటే తప్పనిసరిగా యూరియాను కలపాలని, యూరియా అందుబాటులో లేదంటే తాము ఏం చేయాలని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రజాశక్తి-బి.కొత్తకోట

ఖరీఫ్ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా యూరియా కొరత తీవ్రంగా ఉంది. మండలానికి సరిపడా యూరియా అందుబాటులో లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం యూరియా కొరత లేదని చెబుతున్నప్పటికీ యూరియా కొరతతో మొక్కజొన్న, వరి నాటిన ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవు తున్నారు. చాలీచాలని యూరియా వస్తుండడంతో కనీసం రైతులకు తెలిసే లోపల అయిపోతుండడం, ఎటువంటి సమాచారం మండల అధికారులు రైతులకు తెలపక పోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కందులు వచ్చిన విషయం కూడా తెలియదని పలువురు రైతులు వాపోతున్నారు. యూరియా విషయంలో ప్రభుత్వం విఫలమైందని, ఉన్నతాధికారుల సైతం కొరత లేదని తెలపడం ఆశ్చర్యంగా ఉందని పలువురు రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రైతుకు సరిపడా యూరియాను ప్రభుత్వం సరఫరా చేయలేకపోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో అల్లాడుతున్నారు. ఓ పక్క రూ.వేలు ఖర్చు పెట్టి దుక్కి చేసి, నారు నాటి, పంట ఏపుగా పెరిగే సమయంలో అవసరమైన యూరియా లభించక పోవడంతో వ్యవసాయ పొలాలు వదిలి అధికారుల చుట్టూ, కార్యాలయాల చుట్టూ, ప్రయివేటు ఫర్టిలైజర్స్ చుట్టూ తిరగాల్సిన దుస్థితి నెలకొంది. రైతు సకాలంలో యూరియా దొరుకుతుందో లేదోనని కుంగిపోతున్నాడు. ఒక్కో రైతుకు ఒక్క యూరియా మూట మాత్రమేనని నిబంధనలు అమలు చేస్తున్నా చాలామంది సన్న, చిన్నకారు రైతులకు ఆ ఒక్కమూట యూరియా కూడా దొరకని పరిస్థితి. కొంతమంది దళారులు మాత్రం అధిక సంఖ్యలో యూరియాను కూడగట్టుకుని మూడో కంటికి తెలియకుండా విక్రయించుకుం టున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఓ పక్క అధికారులు మాత్రం యూరియా కొరత లేదని, అపోహలకు వెళ్లొద్దని తెలియజేస్తున్నారు. అధికారులు చెప్పినట్లు యూరియా కొరత లేకపోతే రైతులు ఎందుకని అంతలా అవస్థలు పడుతున్నారో అధికారులే తేల్చాల్సి ఉంది.

యూరియా కొరతతో తీవ్ర ఇబ్బందులు

యూరియా కొరతతో ఇబ్బందులు పడుతున్నాం. మొక్కజొన్న పంటకు యూరియా వేసే సమయం కూడా ముగిసింది. యూరియా ఎప్పుడు వస్తుందో ఎప్పుడైపోతుందో తెలియడం లేదు. కొన్ని ఫెర్టిలైజర్స్‌కి వచ్చిన యూరియాని రూ.340 వరకు విక్రయిస్తున్నారు. చాలీచాలని యూరియా కొరతతో తీవ్ర అవస్థలు పడుతున్నాం. ప్రభుత్వం రైతులుకు యూరియా కొరత లేకుండా చూడాలి.

- తుమ్మగింజల వెంకటరమణ, రైతు, బి.కొత్తకోట.

కర్నాటక నుంచి తెచ్చుకుంటున్నాం

యూరియా కొరత వల్ల జొన్న, మొక్కజొన్న, వరి పంటకు అవసరమయ్యే యూరియా కొరత వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. కర్ణాటక రాష్ట్రంలోని చింతామణికి వెళ్లి రూ.350 వెచ్చించి యూరియా తెచ్చుకుంటున్నాం. బస్తాకు రూ.40 దాకా ఖర్చు వస్తోంది. ప్రభుత్వం యూరియా కొరత లేకుండా రైతులకు కావలసిన యూరియాని అందుబాటులో తీసుకొచ్చి ఆదుకోవాలి.

- శ్రీరాములు, రైతు, జనుపువారిపల్లె.

అధికారులు చొరవచూపాలి

యూరియా కొరత ఈ ఏడాది ఎక్కువగా ఉంది. పక్క మండలాలకి వచ్చిందని తెలిసినా అక్కడ వెళ్తే ఆ మండలానికి వాళ్లకే ఇస్తామంటున్నారు. ఏ మండలంలో ఎప్పుడొస్తుందో చెప్పేవారే లేకుండా పోయారు. యూరియా కొరతతో చాలా ఇబ్బంది పడుతున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు చొరవ చూపి రైతులకు సకాలంలో యూరియాను అందజేయాలి.

- సుబ్బిరెడ్డి, రైతు, కొత్తసుబ్బరాయనపల్లి, పిటిఎం.

ధర దిగాలు.. రైతులు కుదేలు

- సాయం తక్కువై.. వ్యయం ఎక్కువై..
- ఉల్లి, టమోటా రైతులకు నష్టం
- దిగుబడి పెరిగినా.. పెట్టుబడి రాని వైనం
- రైతుల లోగిళ్లలో మగ్గుతున్న పత్తి
- పండ్ల ధరలూ అంతంత మాత్రమే

ఉల్లి పంటను ఆరబెడుతున్న రైతులు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలేక రైతులు కుదేల వుతున్నారు. ప్రభుత్వం నుంచి సాయం లేక రైతన్నకు వ్యయం ఎక్కువైంది. ఉల్లి, టమోటా ధరలు నేలచూపు చూడడంతో రైతన్నకు నష్టాలు మిగిలాయి. ఆరు గాలం కష్టపడి పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మీనమేషాలు లెక్కిస్తుండటంతో రైతులు ఆర్థికంగా చితికిపో తున్నారు. పంటలు సాగుచేయాలంటేనే రైతులు వెనకంజవేసే పరిస్థితి నెల కొంది. తీరా పంట చేతికొచ్చిన తర్వాత గిట్టుబాటు ధరలు వస్తాయో రావోనన్న టెన్షన్‌లో రైతన్న కొట్టుమిట్టాడుతున్నాడు. రైతులను అన్ని విధాలా ఆదుకుం టామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్భాటపు ప్రచారాలు చేయడమే తప్ప ఆచరణలో మాత్రం శూన్యంగా ఉండటంతో రైతుల లోగిళ్ళలో పంటలు మగ్గే పరిస్థితులు నెలకొన్నాయి. ప్రధానంగా జిల్లాలో వేలాది ఎకరాల్లో పత్తి పంటను సాగు చేసారు. గత ఏడాది కిలో రూ.75 నుండి రూ.85 వరకు అమ్మింది. ప్రస్తుతం రూ.65 మాత్రమే ఉంది. వ్యాపారులు సిండికేట్‌గా మారి కొనుగోలు చేస్తుండటంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఉల్లి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని రోడ్డెక్కి ఆందోళన చేసిన పరిస్థితులు కూడా ఉన్నాయి.

ఉల్లి, టమోటా ధరలు నేలచూపు

ఉల్లి రైతు పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఉల్లి పంటను కొనడానికి వ్యాపారులు ముందుకు రాక పొలాల్లోనే రైతులు వదిలేసిన సంఘటనలు కూడా ఉన్నాయి. ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పిస్తామని చెప్పిన ఇంతవరకూ కల్పించలేదు. ఉల్లి రైతులకు హెక్టారుకు రూ.50 వేలు ప్రభుత్వం ఆర్థిక సాయం చేస్తున్న చేస్తామని ప్రకటించింది. ఇ-క్రాఫ్ చేయించుకున్న వారికి మాత్రమే రాయితీ వస్తుందని అధికారులు చెప్తున్నారని రైతులు ఆందోళన చెందుతున్నారు. టమోటా ధరలు కూడా గత ఆరు నెలల నుంచి కిలో రూ.10కి నుంచి పోలేదు. అటు ఉల్లి రైతులు ఇది టమోటా రైతులు గిట్టు బాటుధరలేక ఆవేదన చెందుతున్నారు. ఒకప్పుడు టమోటా, ఉల్లి ధరలు సెంచరీ దాటిన సందర్భాలు ఉన్నాయి. ప్రస్తుతం రూ.10 నుంచి రూ.15లకు పడిపోయింది.

అరటి పంట

పడిపోయిన అరటి, చీనీ ధరలు

గతంలో అరటి టన్ను ధర రూ.30 వేలు ఉండగా ప్రస్తుతం రూ.10 వేల లోపు ఉంది. చీనీ టన్ను ధర రూ.50 వేలు ఉండగా ప్రస్తుతం రూ.10 వేలు ఉంది. ఎన్నడు లేని విధంగా చీనీ ధరలు పడిపోవడంతో రైతులు చీనీ చెట్లను నరికి వేస్తున్నారు. అరటి రెండు, మూడు పంట కాయలను వ్యాపారులు అడిగే పరిస్థితి లేదు. రైతులు ఎంతో కొంత ఇచ్చి కాయలు తీసుకు వెళ్ళమని వ్యాపారులను బతిమాలుతున్న పరిస్థితి నెలకొంది. ధరలు పూర్తి స్థాయిలో పడిపోయి రైతులు నష్టపోతున్నారు.

ధరలు తగ్గడం ఎప్పుడూ లేదు

అన్ని పంటలకు ఒకేసారి ధరలు తగ్గడం ఎప్పుడూ చూడలేదు. ఏదోఒక పంటకు గిట్టుబాటు ధర ఉండడంతో నష్టం వచ్చేది కాదు. ఒక పంట ధర తగ్గినా ఇంకో పంటకు ధర ఉండటం వల్ల రైతుకు కొంతవరకు ఊరట కలిగేది. ఇప్పుడు ఒకేసారి అన్ని పంటలకూ ధరలు తగ్గాయి. ప్రభుత్వం ఆదుకోవాలి.

- గంగిరెడ్డి, రైతు, పులివెందుల.

ధర లేక చీనీ చెట్లను కొట్టేసాను

గిట్టుబాటు ధర లేక చీనీ చెట్లను నరికి వేయాల్సి వచ్చింది. పంటకు తెగులు రావడంతో మందులు ఎక్కువగా పిచికారి చేయాల్సి వచ్చేది. అధిక ఖర్చు రావడం, ధరలు లేక నష్టాలు వస్తుండడంతో నాకున్న రెండు ఎకరాల చెట్లను కొట్టివేయడం జరిగింది.

- రామిరెడ్డి, రైతు, లింగాల.

మాట్లాడుతున్న ఎస్‌పి ధీరజ్ కునుబిల్లి

అభ్యంతరకర పోస్టులు పెడితే చర్యలు

- ఎస్‌పి ధీరజ్ కునుబిల్లి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

సామాజిక మాధ్యమాల్లో అభ్యంతరకర, అశ్లీల పోస్టులు పెట్టిన 57 మంది పై కేసుల నమోదు చేశామని ఎస్‌పి ధీరజ్ కునుబిల్లి పేర్కొన్నారు. బుధవారం ఎస్‌పి కార్యాలయంలోని పరేడ్ గ్రౌండ్‌లో ఆయన మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ట్విట్టర్, పేస్‌బుక్, యూట్యూబ్, వాట్సప్‌లలో పలువురు ఇబ్బంది కలిగించేలా పోస్టులు పెట్టడం అభ్యంతరకర, అన్ పార్లమెంటరీ పదాలు వాడటం వంటి వారిని గుర్తించి 57 మందిపై కేసు నమోదు చేశామని తెలిపారు. జిల్లాలో అన్ని మతాలవారు ఉన్నారని మతపరమైన పోస్టులు గాని, ఒకరినొకరు కించపరిచే విధంగా పోస్టులు పెట్టిన ఉపేక్షించేది లేదని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ మత సామరస్యం చాటుతూ జిల్లాలో శాంతిభద్రతలకు భంగం కలగకుండా సహకరించాల్సిన అవసరం ఉందని తెలిపారు. సమావేశంలో రూరల్ సిఐ వరప్రసాద్, ఎస్‌బి సిఐ రాజా రమేష్, తులసిరామ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన అవసరం

ప్రజాశక్తి-పీలేరు: హెచ్‌ఐవి, ఎయిడ్స్ పట్ల ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని డాక్టర్ నాగవేణి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ హెచ్‌ఐవి, ఎయిడ్స్ నిర్మూలన మరియు నియంత్రణ మండలి, అన్నమయ్య జిల్లా అధికారి డాక్టర్ రమేష్ బాబు సూచనలని అనుసరించి ఇంటెన్సిఫైడ్ ఐఇసి క్యాంపెయిన్‌లో భాగంగా బుధవారం పీలేరు, కంభంవారిపల్లిలో ఐసిటిసి, కోర్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో మొబైలు ఐఇసి వ్యాను ద్వారా వీడియోలు, లఘుచిత్రాలు ప్రదర్శిచి ప్రజలకు హెచ్‌ఐవి, ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. హెచ్‌ఐవి, ఎయిడ్స్‌పై సమాచారాన్ని అందించేందుకు, ప్రజల్లో అవగాహన పెంచేందుకు నాకో (ఎన్‌ఎసిఒ) నేతృత్వంలో రాష్ట్ర స్థాయిలో 8 వారాల పాటు మీకు తెలుసా కార్యక్రమాన్ని చేపట్టారు. క్యాంపెయిన్‌లో భాగంగా కోర్ సంస్థ ఉద్యోగులు మాట్లాడుతూ హెచ్‌ఐవిపై తయారు చేసిన 8 రకాల అంశాలపై ఎనిమిది వారాల పాటు అవగాహన కార్యక్రమాలను చేపట్టడం జరుగుతోందని పేర్కొన్నారు. హెచ్‌ఐవి, ఎయిడ్స్, సుఖ వ్యాధుల పట్ల అవగాహనతో ఎక్కువ మంది హెచ్‌ఐవి రక్త పరీక్షలు చేసుకునేందుకు ముందుకు రావడం జరుగుతోందని తెలియజేశారు. హెచ్‌ఐవి బాధితుల పట్ల ఉన్న చిన్న చూపు, వివక్షను హెచ్‌ఐవి, ఎయిడ్స్ ఆక్ట్ 2017, టోల్ ఫ్రీ నెంబర్ 1097 మొదలైన వాటిపై అవగాహన కల్పించడం ద్వారా వారి వివక్షను తగ్గించి, వారి జీవిత కాలాన్ని పొడిగించవచ్చని తెలిపారు. అందరూ రక్త పరీక్షలు చేసుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ నాగవేణి, డాక్టర్ రేష్మ (గర్నమిట్ట పిహెచ్‌సి), ఐసిటిసి కౌన్సిలర్లు రవి, మురళి మెహన్, కోర్ ప్రాజెక్ట్ మేనేజర్ సుమలత, ఆల్తాప్, హసీన, శైలజ, హాస్పిటల్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

చిత్రాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

భూమి కేటాయింపుపై ప్రతిపాదనలు : కలెక్టర్

ప్రజాశక్తి-రాయచోటి

ఆంధ్రప్రదేశ్ సోలార్ పవర్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ వారికి లీజ్ ప్రాతిపదికన భూముల కేటాయింపుకు సంబంధించిన ప్రతిపాదనలను ఆలస్యం చేయకుండా వెంటనే పంపించాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులకు సూచించారు. బుధవారం విజయవాడలోని సిసిఎల్‌ఎ కార్యాలయం నుంచి సిసిఎల్‌ఎ జయలక్ష్మి ఆధ్వర్యంలో సంబంధిత జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో భూ కేటాయింపుపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్, జెసి కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, అధికారులు సమా వేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎపిఎస్ పిడిసిఎల్ వారికి గాలివీడు సోలార్ పవర్ ప్రాజెక్ట్ నిర్మాణం కోసం గతంలో భూమి కేటాయింపు ప్రతిపాదనను సమర్పించినట్లు తెలిపారు. సోలార్ పవర్ ప్రాజెక్ట్ సంబంధించిన తూముగుంట, వెలిగల్లుకు సంబంధించిన లీజ్ ప్రక్రియ పనులను ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం తయారుచేసి ఫైళ్లను వేగవంతం చేయాలని, శనివారం లోపు నివేదికలను పంపే విధంగా చూడాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో ల్యాండ్ సెక్షన్ సూపరింటెండెంట్ శ్రావణి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

కార్డులను పంపిణీ చేస్తున్న మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నిరంజన్‌రెడ్డి

అర్హులందరికీ స్మార్ట్ రేషన్ కార్డులు

ప్రజాశక్తి-వాల్మీకిపురం

మండలంలో అర్హులైన ప్రతి కుటుంబానికి స్మార్ట్ రేషన్‌లను ప్రభుత్వం పంపిణీ చేస్తోందని టిడిపి నాయకుడు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కంభం నిరంజన్ రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని రేషన్ షాప్ 1లో లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రచారాలకు స్వస్థి పలికి, ప్రజా పాలన అందిస్తుందన్నారు. ప్రభుత్వం ప్రతి వ్యవస్థను సరైన దిశలో నడిపిస్తోందని, త్వరలో రాష్ట్రంలో అభివృద్ధి ఫలాలు అందరికీ అందుతాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం కట్టుబడి ఉందని, కొత్త రేషన్ కార్డుల ద్వారా మరింత్ పారదర్శకంగా అవసరమైన సబ్సిడీ వస్తువులు అందుతాయన్నారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను చిత్తశుద్ధితో అమలు చేస్తోందన్నారు. గత ఐదేళ్ల పాలనలో వైసిపి నాయకులు రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించారన్నారు. కార్యక్రమంలో నాయకులు వలిగట్ల వెంకట్రమణ, రెడ్డి, గోవిందు, సైదు, కువైట్ బాబు, డిష్ బ్రదర్స్, గంగులప్ప తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జీపు వేలం పాటకు దరఖాస్తు

ప్రజాశక్తి-రాయచోటి

రాయచోటి ఐసిడిఎస్ కార్యాలయంలో ప్రభుత్వానికి సంబంధించిన ఒక జీపు వేలం వేసేలా నిర్ణయించామని, ఆసక్తిగలవారు దరఖాస్తులు చేసుకోవాలని సిడిపిఒ శశికళ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తమ కార్యాలయంలో ఎపి04-6694 నెంబరు కలిగిన 1992 మోడల్ గల ప్రభుత్వ జీపు వేలం వేయనున్నామన్నారు. ఈ వేలంలో పాల్గొనేందుకు ఆసక్తిగలవారు ఈవుల 24 వ తేదీ నుంచి 30 వ తేదీ లోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. దరఖాస్తుదారులు రూ.5 వేలు డిడిని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లో సమగ్ర శిశు అభివృద్ధి అధికారిణి, రాయచోటి పేరుతో తీసి దరఖాస్తుకు జతచేయాలని పేర్కొన్నారు. దరఖాస్తుదారులు ఆధార్ కార్డ్, బయోడేటా,పూర్తి అడ్రస్ ప్రూఫ్ ఉండాలని పేర్కొన్నారు. వివరాలకు రాయచోటిలోని ఐసి డి ఎస్ కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణయాత్రకు తరలిరండి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్: రాజ్యాంగ పరిరక్షణ యాత్ర ను జయప్రదం చేయాలని మాల మహానాడు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ యమల సుదర్శన్ పిలుపు నిచ్చారు. బుధవారం స్థానిక మాలమహానాడు కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు శివయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన సమా వేశంలో ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ పరిరక్షణ యాత్ర గత నెల సెప్టెంబర్ 3న కుప్పం లో ప్రారంభమైందని, ఈ నెల 28న మదనపల్లె కు చేరుకుంటారని తెలిపారు. స్థానిక మాల మహానాడు కార్యాలయం నుంచి చిత్తూరు బస్టాండ్ మీదుగా అంబేద్కర్ విగ్రహం వరకు యాత్ర జరుగుతుందని తెలిపారు. ఈ యాత్రలో మాల మహానాడు నాయకులు, మాల ఉద్యో గులు, విద్యార్థి సంఘం, మాల మేధావులు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాయల సీమ కన్వీనర్ యమల చంద్రయ్య, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గూండా మనోహర్, జిల్లా అధికార ప్రతినిధి మల్లెల మోహన్, జిల్లా కార్యదర్శి హరి, రమణ, శేఖర్‌బాబు పాల్గొన్నారు.

లోక్ కల్యాణ మేళాను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్ : కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం రూపొందించిన లోక్ కల్యాణ మేళాను వీధి విక్రయదారులు సద్వినియోగం చేసుకోవాలని రాజంపేట మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాసులు పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ సిఎం స్వనిధి 2.0 లో భాగంగా వీధి విక్రయదారులకు రుణ సదుపాయాలు, క్రెడిట్ హామీ, వడ్డీ సబ్సిడీ, డిజిటల్ లావాదేవీల ప్రోత్సాహకాలు లభిస్తాయని తెలిపారు. మొదటి విడతలో రూ.15వేలు, రెండవ విడతలో రూ.25వేలు రుణాలు మంజూరు అవుతాయని పేర్కొన్నారు. యుపిఐ లింక్ రూపే క్రెడిట్ కార్డులు గరిష్టంగా రూ.30వేల వరకు అందజేస్తారని తెలిపారు. కార్మికశాఖ అధికారులు మాట్లాడుతూ పిఎం శ్రమయోగి మందాన్ పెన్షన్, పిఎం సురక్ష బీమా యోజన, పిఎం జీవన్ జ్యోతి బీమా యోజన, పిఎం జనధన్ యోజన వంటి పథకాల ద్వారా ప్రతి అసంఘటిత రంగ కార్మికులు ప్రయోజనం పొందాలని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ తుపాకుల అశోక్ కుమార్, ఐసిడిఎస్ బ్యాంకు ప్రతినిధులు, మున్సిపల్, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కమిషనర్ శ్రీనివాసులు

వాల్మీకిపురం : మాట్లాడుతున్న డిప్యూటీ డిఎంహెచ్‌ఒ డాక్టర్ రమేష్‌బాబు

టిబి రహిత సమాజ స్థాపనకు కృషి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

టిబి వ్యాధి లేని సమాజ స్థాపన కొరకు కృషి చేద్దామని మైభారత్ వాలంటీర్‌గా చేరుదామని డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ, టిబి పర్యవేక్షకులు ప్రభాకర్ పేర్కొన్నారు. స్వస్థ నారీ-సశక్త్ పరివార్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని జ్ఞానాంబికా డిగ్రీ కళాశాల, బిటి కళాశాల విద్యార్థులకు టిబి వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మై భారత్ వాలంటీర్ పోర్టల్‌లో ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్‌గా నమోదు చేసుకుంటే నవ భారత నిర్మాణం, నైపుణ్య అభివృద్ధి, శిక్షణ, కౌన్సిలింగ్, మానసిక పరిపక్వత, మనోధైర్యం నింపడానికి ఉండాల్సిన లౌక్యం వంటి వాటిపై ఆన్‌లైన్‌లో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. క్షయ రోగుల పట్ల వివక్షత చూపకుండా ఉండడం, వారిలో మానసిక ధైర్యం నింపడం, టిబిని జయించిన వారిని రోల్ మోడల్‌గా చూపడం వంటివి చేయాలన్నారు. టిబి రోగులకు పౌష్టికాహారం ఇవ్వడానికి వారిని దత్తత తీసుకోవడానికి ప్రిన్సిపల్ రాఘవ రెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ కో-ఆర్డినేటర్ శైలజ, విద్యార్థులు ముందుకు రావడం హర్షనీయమన్నారు. రెండు వారాలకు పైబడి దగ్గు, రాత్రి పూట జ్వరం రావడం, ఛాతిలో నొప్పి, గస, ఆయాసం, నీరసం, బరువుతగ్గడం,ఆకలి లేకపోవడం, గళ్ళ పడటం, రక్తం చక్కలు గళ్ళలో కనిపించడం వంటి లక్షణాలు ఉంటే టిబి వ్యాధి అని అనుమానించి ఆశా కార్యకర్తను సంప్రదించి ప్రభుత్వ అస్పత్రిలో గళ్ళ పరీక్షలు చేయించాలన్నారు. టిబి వ్యాధి ఒకరి నుంచి మరొకరికి నోటి తుంపరల ద్వారా వ్యాపిస్తుందని, ఈ నోటి తుంపరలు గాలిలో చేరి అందులోని బాక్టీరియాను ఆరోగ్యవంతులు పీల్చడం వల్ల టిబి సంక్రమిస్తుందన్నారు. గళ్ళ పరీక్షలో వ్యాధి ఉన్నట్లు నిర్ధారణ అయితే ఆరు నెల లు మందులు డాట్స్ ఆధ్వర్యంలో వాడాలని, చికిత్స కాలంలో రోగికి పిఎం పోషణ అభియాన్ పథ కం కింద వెయ్యి రూపాయలు వారి ఖాతాలో జమ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రమాదేవి, రాఘవరెడ్డి, కో-ఆర్డినేటర్ శైలజ, శ్రీనివాస్ అధ్యాపకులు, అధ్యాపక బృందం, టిబి యూనిట్ సిబ్బంది సుశీల, వనజ కుమారి, తరుణ్, సునీత, విద్యార్థులు పాల్గొన్నారు.

వాల్మీకిపురం: విద్యార్థి దశ నుంచే వివిధ సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం వలన సమాజంలో జరుగుతున్న వాటిపై అవగాహన కలిగి ఉండవచ్చునని డిప్యూటీ డిఎంహెచ్‌ఒ డాక్టర్ రమేష్‌బాబు అన్నారు. ట్టణంలోని పివిసి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మై భారత్ వాలంటీర్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మై భారత్ వాలంటీర్ పోర్టల్‌లో నమోదు చేసుకొని నవ భారత నిర్మాణం కోసం కృషి చేయాలన్నారు. టిబి వ్యాధి లేని సమాజ స్థాపన కోసం విద్యార్థులు మై భారత్ వాలంటీర్‌గా సేవలందించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఉమా అమరేశ్వరి, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ, టిబి యూనిట్ సూపర్‌వైజర్ నాగిరెడ్డి, సిబ్బంది భూపతి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి కలిసికట్టుగా పనిచేద్దాం

ప్రజాశక్తి-వాల్మీకిపురం

మండల అభివృద్ధికి కలిసికట్టుగా పని చేద్దామని వాల్మీకిపురం ఎంపిడిఒ మనోహర రాజు అన్నారు. బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సమావేశ భవనంలో మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ అడ్వాన్స్‌మెంట్ ఇండెక్స్, పి4పై అవగాహన కల్పించారు. మండలంలో పెండింగ్ ఉన్న పనులను త్వరతిగతిన పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ సుధాకర్ రెడ్డి, ఎఒ శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ చక్రపాణి, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిడిఒ జాషువా

పి4 యాప్‌లో నమోదు చేయాలి

ప్రజాశక్తి-రామాపురం

మండలంలోని సచివాలయ పరిధిలో ఎంపిక చేసిన బంగారు కుటుంబాలను పి4 యాప్‌లో అప్‌డేట్ చేయాలని ఎంపిడిఒ జాషువా పేర్కొన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలోని సభా భవనంలో బుధవారం ఎంపిడిఒ, తహశీల్దార్ వెంకటేశ్వర్లు, ఎఎస్ఒ నాగార్జున ఆధ్వర్యంలో పి4పై ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 13 గ్రామ పంచాయతీ సచివాలయాల పరిధిలో పి4 బంగారు కుటుంబాలను కింద 25 కుటుంబాలను గతంలో ఎంపిక చేసినట్లు తెలిపారు. ఆ కుటుంబాలకు కావలసిన ఆర్థిక అవసరాలు, ఆర్థికేతర అవసరాలను ప్రతి నెలకు రెండు పర్యాయాలు ప్రతి కుటుంబం వద్దకు వెళ్లి వారి సమాచారం వారి బాగోగులు తెలుసుకొని సమాచారాన్ని పి4 యాప్‌లో అప్‌డేట్ చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం పి4 కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందన్నారు. అధికారులు, సచివాలయ సిబ్బంది ఈ కార్యక్రమాన్ని చిత్తశుద్ధితో పనిచేసి మండలానికి మంచి పేరు తీసుకురావాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఇఒ నాగమణి, 13 గ్రామ పంచాయతీలోని సచివాలయ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బి.కొత్తకోట ఎంపిడిఒగా అబ్దుల్

ప్రజాశక్తి-బి.కొత్తకోట

ఎంపిడిఒకు పుష్పగుచ్ఛం అందిస్తున్న సిబ్బంది

బి.కొత్తకోట ఎంపిడిఒగా అబ్దుల్ షక్కూర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న కృష్ణవేణి బదిలీ అవడంతో ఆమె స్థానంలో మదనపల్లిలో డిప్యూటీ ఎంపిడిఒగా విధులు నిర్వహిస్తున్న ఆయన ఉద్యోగోన్నతిపై ఎంపిడిఒగా నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ మండలాన్ని అన్నివిధాల అభివృద్ధి చేయడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. కార్యాలయ సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

డిప్యూటీ ఎంపిడిఒగా ఈశ్వర్‌రెడ్డి

తంబళ్లపల్లి : మండల డిప్యూటీ ఎంపిడిఒగా ఈశ్వర్‌రెడ్డి ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇఒఆర్‌డి స్థానంలో ప్రభుత్వం డిప్యూటీ ఎంపిడిఒ పోస్టును పెట్టినట్లు ఎంపిడిఒ థామస్ తెలిపారు. వంచాలమర్రి పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తున్న ఈశ్వర్ రెడ్డికి డిప్యూటీ ఎంపిడిఒగా అదనపు బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు.

ఘనంగా శివశంకర్‌నాయుడు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

శివశంకర్‌నాయుడు జన్మదిన వేడుకల్లో వాకర్స్ సభ్యులు

స్థానిక బివిఎస్ పాఠశాలలో రాజంపేట వాకర్స్ అసోసియేషన్ సభ్యుల సమక్షంలో డబ్బూఆర్ కరణం శివశంకర్‌నాయుడు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ ఉపాధ్యక్షులు డబ్బూఆర్ కొండూరు శరత్‌కుమార్‌రాజు మాట్లాడుతూ వాకర్స్ అసోసియేషన్ రాజంపేట 500మంది సభ్యులు కలిగిన గొప్ప క్లబ్ అని, రాజంపేట చుట్టు ప్రక్కల ప్రాంతాలలో వివిధగా మెగా ఉచిత నేత్ర వైద్య శిబిరాలు, సాధారణ వైద్య శిబిరాలు, ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. శివశంకర్‌నాయుడు నిండు నూరేళ్ళు ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో ప్రజలందరూ తమ పుట్టినరోజు వేడుకలు కేకులు కట్ చేసి సంబరాలు జరుపుకుండా స్వచ్ఛమైన, తాజా పండ్లను కట్ చేసి నిర్వహించాలని, పుచ్చకాయను కట్ చేసి జన్మదిన వేడుకలు జరుపుకున్నట్లు తెలిపారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు సుబ్బరామరాజు, వెంకటయ్య నాయుడు, డబ్బూఆర్ వెంకటయ్య నాయుడు, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

ప్రజాశక్తి-వాల్మీకిపురం:

మండలంలోని గండబోయనపల్లి కోటలో శ్రీ సత్యమ్మ తల్లి ఆలయంలో మూడవ రోజు శ్రీ సత్యమ్మతల్లి అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని ఉదయం సుప్రభాత సేవతో మేల్కొలిపి అర్చన, అభిషేకాలు, విశేష పూజా కార్యక్రమాలు, అలంకరణలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించడంతో భక్తులు అమ్మవారికి పూజలు నిర్వహించి, మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పులి సత్యనారాయణరెడ్డి, సిద్ధం చక్రపాణి, ప్రభాకర్ రెడ్డి, అమర్నాథ్ రెడ్డి, ఓబుల్ రెడ్డి, రమేష్, చంద్రశేఖర్, చిన్నపరెడ్డి, హరి, సర్పంచ్ గుర్రప్ప, పూజారి అక్కన్న భక్తులు, మేకలావారిపల్లి గ్రామస్తులు పాల్గొన్నారు. **నందలూరు :** శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నాగిరెడ్డిపల్లి గ్రామంలో వెలిసిన శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి ఆలయంలో మూడవరోజు బుధవారం గజలక్ష్మి దేవి అలంకారంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరీ దేవి భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం గ్రామ పురోహితులు బండా త్రిమూర్తి శివకుమార్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకం, చండీ పారాయణం, నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్ష కార్యదర్శులు యంబలూరు నరసింహ స్వామి, మాకం వెంకట కుమార్, చలపతి నరసింహ శ్రేష్టి, సెక్రెటరీ గెలివి నాగ సురేంద్ర కుమార్, సంయుక్త కార్యదర్శులు నరసింహా ప్రసాద్, మంచికంటి నారాయణ, ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులు సునీల్, కుమార్, ఆర్యవైశ్య సంఘ సభ్యులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE XI ADDL. DISTRICT JUDGE, CHITTOOR DISTRICT AT : PILER

I.A.No. 74/2023
O.S.No. 04 of 2023

Between:
Shaik Khader Basha & others. ...Petitioners/Plaintiffs
And
Dr. C. Sandeep Kumar & others. ...Respondents/Defendants

NOTICE TO RESPONDENTS 70, 72 TO 75

70. Smt. D. Saritha, W/o. D. Srinivasula Reddy, R/at H.No. 19-4-3H/2A1, Nagi Reddy Colony, Piler Post, Annamayya District - 517 214.
72. Sharan Kumar Reddy, S/o. Bhujeevanam Bhumi Reddy Narasimha Reddy, R/at. Yellamanda "X" Road, Piler Post, Annamayya District - 517 214.
73. Smt. Saritha, W/o. Bhujeevan Devalapalle Srinivasula Reddy, R/at Nagireddy Palem, Tirupati Road, Piler Post, Chittoor District.
74. Deepthika, D/o. Bhujivanam Varakasi Thirunatha Reddy, R/at. Nehru Bazar Street, Piler Post, Chittoor District.
75. Smt. Bhanu Rekha, W/o. Bhujivanam Varakasi Thirunatha Reddy, R/at Nehru Bazar Street, Piler Post, Chittoor District.

Whereas the above named petitioner(s)/Plaintiff(s) have filed the petition in the above matter. If you have got any objection, you may appear before this Court at 10:30 AM on 14-10-2025 either in person or through an advocate and file your objection before the Hon'ble Court. If you fail to do so, the matter will be decided ex-parte.

//By Order of Court//

CMR VELU
SK. MASTHAN ZULFEKAR
Advocates, Hyderabad.
Cell No: 7702637790.
B.RAVEENDRANATHA REDDY
Advocate, Piler.

విద్యార్థులు సేవా దృక్పథం అలవర్చుకోవాలి

- ఘనంగా సేవా పథక దినోత్సవం

మదనపల్లి : మొక్కలు నాటుతున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

ప్రజాశక్తి-వీరబల్లి

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ సేవా పథక దినోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ అజంతుల్లా మాట్లాడుతూ విద్యార్థులు సేవా దృక్పథం అలవర్చుకోవాలని పేర్కొన్నారు. విద్యార్థులు ఎన్ఎస్ఎస్‌లో వాలంటరీగా చేరడం వల్ల సేవా దృక్పథాన్ని అలవర్చు కోవచ్చన్నారు. సమాజానికి ఎంతో కొంత సేవ చేయెచ్చని ప్రతి విద్యార్థి ఎన్ఎస్ఎస్‌లో వాలంటరీగా చేరడం ప్రథమ కర్తవ్యం పెట్టుకోవాలని పేర్కొన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ భాస్కర్ మాట్లాడుతూ ఈ పథకం ద్వారా దత్తత గ్రామాలలో అవగాహన కార్యక్రమాలు , పరిశుభ్రత, పచ్చదనం ఆరోగ్యం పైన ర్యాలీలు ఎన్నో కార్యక్రమాలు నిర్వహించే అవకాశం ఉంటుందని చెప్పారు. ప్రతి విద్యార్థి వాలంటరీగా చేరి తాము నివసించే ప్రాంతానికి, సమాజానికి ఎంతో కొంత సేవ చేయాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు చంద్రశేఖర్‌రెడ్డి, వేణుగోపాల్, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు. **మదనపల్లె :** ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ ఫౌండేషన్ డేను ఘనంగా నిర్వహించినట్లు డైరెక్టర్ డాక్టర్ రామలింగారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ విద్యార్థులు స్థానిక చంద్రమక ఎలపల్లెలో మొక్కలు నాటారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి మాట్లాడుతూ పచ్చదనాన్ని విస్తరించడం ద్వారా వాతావరణ మార్పులను ఎదుర్కోవడమే కాక గ్రామీణ ప్రాంతాల్లో పర్యావరణ సమతుల్యాన్ని కాపాడవచ్చని, కాలుష్యాన్ని తగ్గించవచ్చని తెలిపారు. ప్రిన్సిపల్ డాక్టర్ పి.రాయుడు చెట్లు భూమి ఉష్ణోగ్రత తగ్గించడంలో, జీవవైవిధ్యాన్ని కాపాడడంలో కీలకమని పేర్కొన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి వై. అరుణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్క నాటి దాన్ని సంరక్షిస్తే భవిష్యత్ తరాలకు మంచి వాతావరణాన్ని అందించవచ్చని విద్యార్థులకు సూచించారు. పుస్తకాలతో పాటు సమాజం పట్ల బాధ్యతను కూడా నేర్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు బి.దర్శన్, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు. **రాయచోటి :** పట్టణంలోని శ్రీసాయి ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పట్టణానికి చెందిన నవ్యత క్లినిక్ నిర్వాహకురాలు డాక్టర్ చమర్తి నవ్యత హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వస్థనారి సశక్త్ పరివార్ అభియాన్ పథకం కింద ప్రతి కుటుంబంలోని మహిళల ఆరోగ్యం కోసం అనేక చర్యలు చేపట్టిందన్నారు. ప్రతి కుటుంబంలో మహిళ ఆరోగ్యకరంగా ఉంటే అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని, మహిళ సాధికారత సాధించినప్పుడే దేశం అన్ని రంగాల్లో ముందంజలోఉంటుందని అభిప్రాయపడ్డారు. పరిపూర్ణమైన ఆరోగ్యం కోసం యోగ, సమీకృత ఆహారం, రెగ్యులర్ హెల్త్ చెకప్ అంశాలపై సూచనలు సలహాలు వివరించారు. కళాశాల డైరెక్టర్ హీరా రాజపుత్ మాట్లాడుతూ విద్యార్థుల దశలో జాతీయ సేవా పథకం ప్రతి విద్యార్థి జీవితాన్ని బంగారు భవిష్యత్తుకు పునాదులు వేస్తుందని వివరించారు. కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ పథకం ద్వారా విద్యార్థుల్లో సేవా గుణాన్ని అలవర్చి, సమాజంలో ఐక్యత ఏర్పరిచి, ఆచార సంప్రదాయాలుపై అవగాహన ఏర్పరిచి గౌరవప్రదమైన పౌరునిగా తీర్చిదిద్దుతుందని వివరించారు. రక్తదానం చేసిన ఎన్ఎస్ఎస్ సభ్య విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ప్రజా చైతన్య సేవా సంఘం అధ్యక్షులు తుమ్మలస్వాతిని సన్మానించారు. **లక్కిరెడ్డిపల్లి :** నేటి యువతకు చదువు విజ్ఞానంతో పాటు సమాజం పట్ల బాధ్యత నిస్వార్థ సేవ గుణం అలవర్చుకోవాలని వెంకటేశ్వర జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం నాడు లక్కిరెడ్డిపల్లి శ్రీ వెంకటేశ్వర జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో ఘనంగా జాతీయ సేవా దినోత్సవం నిర్వహించారు ఎన్ఎస్ఎస్ విద్యార్థులు కళాశాల పరిసర ప్రాంతాలను స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కృష్ణారెడ్డి ఉత్తమ సేవలు చేసిన ఎన్ఎస్ఎస్ వాలంటీర్లకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకుల సహదేవరెడ్డి, సుందరావు, శాంతయ్య కళ్యాణి, అనూష పాల్గొన్నారు. **పీలేరు:** విద్యార్థులు చదువుతో పాటు దేశభక్తి, గురువులు, పెద్దల పట్ల గౌరవం, సేవా నిరతిని అలవర్చుకోవాలని ప్రిన్సిపాల్ ఎం. సుధాకర్ రెడ్డి తెలిపారు. పీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణంలో ఎన్ఎస్ఎస్ విభాగం జాతీయ సేవా పథకం - 2025 దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా జరుపుకుంది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ మన దేశ ప్రగతికి విద్యార్థులు, యువతే మూలమని అన్నారు. ఎన్ఎస్ఎస్ కో- ఆర్డినేటర్ బి. సహదేవ మాట్లాడుతూ విద్యార్థులు జాతీయ సేవా పథకం ద్వారా నిర్వహించే సామాజిక సేవా కార్యక్రమాలలో ఉత్సాహంగా పాల్గొనడం వలన ఉత్తమ దేశ పౌరులుగా ఎదగడానికి అవకాశం ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, ఆఫీసు సిబ్బంది పాల్గొని కళాశాల ఆవరణంలోమొక్కలు నాటి తమ సేవానిరతిని చాటుకున్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం : సిడిపిఒ

సుండుపల్లి: మాట్లాడుతున్న సిడిపిఒ రాజమ్మ

ప్రజాశక్తి-సుండుపల్లె

గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని సిపిడిఒ రాజమ్మ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రం సుండుపల్లిలోని అంగన్వాడీ కేంద్రంలో పోషక విలువల అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఒ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలకు మంచి విలువలతో కూడిన పోషక పోషకాలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. ఆకు కూరలు, కూరగాయలు, తాజా పండ్లు తీసుకోవడం శరీరానికి కావాల్సినంత ప్రొటీన్లు లభిస్తాయన్నారు. గర్భిణుల్లో రక్తహీనత కలుగకుండా పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. చిన్నపిల్లలు కూడా పోషక ఆహారాన్ని తప్పకుండా అందించాలని ఆమె తెలిపారు. అంగన్వాడీలో లభించే పోషక పదార్థాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంగన్వాడీ కార్యకర్తలు ఉదయం నుంచి సాయంత్రం వరకు తప్పనిసరిగా అంగ న్వాడీ కేంద్రాల్లో ఉండాలని, ప్రభుత్వం నిబంధన ప్రకారం పనిచేయాలని చెప్పారు. ప్రతి రోజూ రిజిష్టర్‌లో వివరాలను నమోదు చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు కులసమ్మ, సుశీల, విజయలక్ష్మి, రాజశేఖర్, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. **తంబళ్లపల్లి:** మండలం కోసువారి పల్లెలో అంగన్వాడీ కేంద్రంలో పోషణ మా కార్యక్రమాన్నినిర్వహిస్తున్నట్లు సూపర్వైజర్ రవణమ్మ తెలిపారు. ప్రతి ఒక్కరూ పౌష్టిక ఆహారం తీసుకున్నప్పుడే ఆరోగ్యం చేకూరుతుందని తెలిపారు. అంగన్వాడీ ఇస్తున్నఅదనపు ఆహారం ఏ విధంగా ఉపయోగించుకోవాలో గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, గర్భిణులు గర్భవతులుపాల్గొన్నారు.

రైతులకు వరం కిసాన్ ధన్ ఆరోగ్య యోజన

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

రైతులు కిసాన్‌ధన్ ఆరోగ్య యోజన బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పివిఆర్ గ్రూప్స్ ఆర్గనైజషన్స్ సభ్యులు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని పర్వత రెడ్డిగారిపల్లి, అప్పకొండయ్యగారిపల్లి, గంగనపల్లిలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కిసాన్ ధన ఆరోగ్య యోజన ప్రయోజన పథకం రైతుల కోసం ప్రత్యేక బీమాపథకమని అన్నారు. .ఈ పథకం ద్వారా రైతులు సభ్యత్వం తీసుకోవడం రైతులకు ఆరోగ్య బీమా రూ.25వేలు వరకు రైతులకు పంట నష్ట నష్టపరిహారం రూ.50వేలు,ఏదైనా ప్రమాదం జరిగితే రూ.3 లక్షల వరకు ప్రమాదబీమా వస్తుందన్నారు. మహిళలకు యూనిట్ రూ.5వేల నుంచి రూ. 1లక్ష వరకు రుణ సౌకర్యం లభిస్తుందన్నారు. మహిళా రైతులు వ్యవసాయ పరికరాలపై 30శాతం, ఆర్గానిక్ ఎరు వుల మీద 40శాతం వరకు సబ్సిడీ అందిస్తుందని తెలిపారు. రైతు సమూహానికి కోళ్ల పెంపకం, గోశాల, చేపల పంపకం, తేనెటీగల పెంపకం, కోల్డ్ స్టోరేజ్, గోదాములకు కూడా రుణ సౌకర్యం కల్పిస్తుందన్నారు. పూర్తి వివరాలకు మండల కో-ఆర్డినేటర్‌ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో రాయలసీమ కో-ఆర్డినేటర్ మల్లికార్జున, కడప, అన్నమయ్య జిల్లాల అవేర్నెస్ మేనేజర్‌సంపత్, రాయలసీమ అవేర్నెస్ మేనేజర్ మణికంఠ, మేనేజర్ సాయి, సంస్థ ప్రతినిధులు హరికృష్ణ, పాల్గొన్నారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్న పివిఆర్ గ్రూప్స్ సభ్యులు

బద్దిపల్లిగుట్ట హౌసింగ్ బోర్డు కాలనీ ప్రజలతో మాట్లాడుతున్న కమిషనర్

హౌసింగ్ కాలనీ రహదారికి మోక్షం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

గత మూడు సంవత్సరాలుగా బద్దిపల్లిగుట్ట హౌసింగ్ కాలనీ రహదారి లేక ఇబ్బంది పడుతున్న ప్రజలకు ఎట్టకేలకు మోక్షం లభించింది. ఈ సమస్యపై మున్సిపల్ కమిషనర్ జి.వి పల్లవి బుధవారం అర్బన్ హౌసింగ్ ఎఇ జియా ఫుజైల్‌కు తెలపడంతో వెంటనే స్పందించి బద్దిపల్లి హౌసింగ్ కాలనీలో జెసిబి సాయంతో రహదారి మరమ్మతులు చేపట్టి పెద్దపెద్ద గుండ్ల సైతం తొలగించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ త్వరలోనే బద్దేపల్లి కాలనీకి పూర్తిస్థాయిలో రోడ్డు ఏర్పాటు చేస్తామన్నారు. పట్టణ ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఆమె స్పష్టం చేశారు.గత కొన్ని రోజులుగా ఇబ్బందులు పడుతున్న కాలనీ ప్రజల సమస్యను పరిష్కరించినందుకు కమిషనర్‌కు కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు.

'స్వాస్థ్య'లో ఆధునిక వైద్య సేవలు విస్తరణ

-టెలి కన్సల్టేషన్ సంచార వైద్యశాల వాహనం ప్రారంభం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పట్టణంలోని స్వాస్థ్య ఆస్పత్రిలో ఆధునిక వైద్యసేవలను విస్తరిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య శిబిరాల నిర్వహణకు టాటా ఎండీ అందించిన ప్రత్యేక టెలి కన్సల్టేషన్, సంచార వైద్యశాల వాహనాన్ని సత్సంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు పద్మభూషణ్ డాక్టర్ ముంతాజ్ ఆలీ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ వెంకటరమణ మాట్లాడుతూ సంచార వైద్యశాల ద్వారా వైద్యులు నేరుగా గ్రామాల్లోకి వెళ్లి, రోగులకు ప్రాథమిక పరీక్షలు, అవసరమైయ్యే నిపుణుల వైద్యుల సలహాలు తక్షణమే అందించ గలిగే సౌకర్యం ఈ వాహనంలో ఏర్పాటు చేశార న్నారు. పేదప్రజలు, గ్రామీణ ప్రాంతవాసులు ఈ సదావకాశాన్ని విని యోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఛైర్మెన్ డాక్టర్ గిరీష్, కృష్ణ మూర్తి, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ రవి, టాటా ఎండీ, బృందం, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కరుణాకర్, ఆర్ఎంవో డాక్టర్.ఆదర్శ్, వైద్య బృందం, సిబ్బంది పాల్గొన్నారు.

కర్కటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల పోస్టర్లు ఆవిష్కరణ

ప్రజాశక్తి -చిట్వేలి : గుండాలకోన కర్కటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు పోస్టర్లను ఆలయ కమిటీ సభ్యులు చైర్మన్ రాజశేఖర్ బుధవారం ఆవిష్కరించారు. ఈ మేరకు గుండాల కోన కర్కటేశ్వరస్వామి దేవస్థానంలో 12 శివలింగాలకు సామూహికంగా భక్తులచే అభిషేక కార్యక్రమాన్ని ఏర్పాట్లు చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపార. నవంబర్ 27 నుంచి ప్రారంభం కానున్న ఈ ఉత్సవాలు ఐదు వారాలు పాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. మరిన్ని వివరాలకు 7710203050 గల నంబర్‌ను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ శివారెడ్డి, సెక్రటరీ ప్రహల్లాద, ట్రెజరర్ రామచంద్రయాదవ్, కమిటీ సభ్యులు గ్రామస్తులుపాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు

ప్రజాశక్తి - నందలూరు : పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేసినట్లు రాజంపేట డివిజన్ పశు సంవర్ధక శాఖ ఉపసంచాలకులు డాక్టర్ విజయభాస్కర్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ పశుసంవర్ధక శాఖ చేపడుతున్న గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు కార్యక్రమం ఈనెల 15 నుంచి 15 అక్టోబర్ 2025 వరకు చేపడుతున్నటుల తెలిపారు. ఈ కార్యక్రమంలో బుధవారం నందలూరు మండలం నాగిరెడ్డిపల్లి పంచాయతీ, నల్ల తిమ్మాయపల్లి పంచాయతీలోని గ్రామాలలో టీకాలు వేయడం జరిగినది. కార్యక్రమంలో పాటూరు, నందలూరు పశు వైద్యులు డాక్టర్ ఈశ్వర ప్రసాద్, డాక్టర్ వై మాధవిలత , జె విఎలు సుగుణ, గంగులయ్య పాల్గొన్నారు.



పశువులకు గాలికుంటు టీకాలు వేస్తున్న పశు వైద్య సిబ్బంది

క్రైం కార్నర్

పట్టుబడ్డ ఎర్రచందనం దుంగలను చూపుతున్న ఎస్‌పి ధీరజ్

ఎర్రచందనం అక్రమ రవాణాకు పాల్పడితే పీడీ యాక్ట్

- ఎస్‌పి ధీరజ్ కునుబిల్లి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

ఎర్రచందనం అక్రమ రవాణాకు పాల్పడితే పీడీ యాక్ట్ నమోదు చేసి జైలుకు పంపు తామని ఎస్‌పి ధీరజ్ కునుబిల్లి హెచ్చరించారు. సుండుపల్లి మండలంలోని మాచిరెడ్డిగారిపల్లి వద్ద ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తున్న 9 మంది తమిళనాడు చెందిన స్మగ్లర్లను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.34 లక్షలు విలువచేసే 12 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. బుధవారం రాయచోటిలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అయన మాట్లాడారు. ముందస్తు సమాచారం మేరకు అన్నమయ్య జిల్లా ఎర్రచందనం టాస్క్ ఫోర్స్ పోలీసులు సుండుపల్లి అటవీ ప్రాంతంలో తనిఖీలు చేస్తుండగా మాచిరెడ్డిగారిపల్లె గ్రామం, తొగురుపల్లి క్రాస్ రోడ్డు వద్ద కారులో ఎర్రచందనం దుంగలను లోడ్ చేస్తుండగా పోలీసులు దాడులు చేసి 9 మంది స్మగ్లర్లను అదుపులోకి తీసుకోగా మరో 5 మంది స్మగ్లర్లు కారుతో పరారీ అయ్యారని తెలిపారు. పోలీసులు స్మగ్లర్లను అదుపులోకి తీసుకునే క్రమంలో పోలీసులపై స్మగ్లర్లు రాళ్ల దాడి చేశారన్నారు. ఈ దాడిలో కొందరు పోలీసులకు గాయాలయ్యాయని వెల్లడించారు.చాకచక్యంగా వ్యవహరించి ఎర్రచందనం దొంగల పట్టుకున్న పోలీసులను ఎస్‌పి అభినందించారు. కార్యక్రమంలో టాస్క్ ఫోర్స్ సిబ్బందితోపాటు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎర్రచందనం దుంగలు స్వాధీనం : ఒకరు అరెస్టు

పీలేరు: వాహనంతో సహా ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్టు చేసినట్లు డిఎఫ్ఒ ఎం.గురు ప్రభాకర్ తెలిపారు. డిఎఫ్ఒ తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ పీలేరు అటవీ శాఖ సంచార దళ నిఘా విభాగం కార్యాలయానికి బుధవారం ఉదయం అందిన రహస్య సమాచారం మేరకు ఎల్లమంద, పులిచెర్ల, మంగళంపేట మార్గాల్లో తాము వాహనాల తనిఖీ చేపట్టడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఫోర్డ్ కారులో 10 ఎర్రచందనం దుంగలు తరలిస్తున్న నిందితుడిని కారుతో సహా అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. కారుతో సహా ఎర్రచందనం దుంగల విలువ రూ.16,82,250 ఉంటుందని అన్నారు. పట్టుబడిన నిందితుడు తమిళనాడు రాష్ట్రానికి చెందిన వ్యక్తి అని చెప్పారు. ఈ దాడిలో ఎఫ్ఆర్ఒ ఎస్. చంద్రశేఖర్, ఎఫ్ఎస్ఒ కె. ప్రతాప్ కుమార్, ఎఫ్.బి.ఓలు కె. ప్రతాప్, పి.రెడ్డి ప్రసాద్, ప్రొటెక్షన్ వాచర్లు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

భార్య విడాకులు ఇవ్వాలని కోరడంతో భర్త ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన సంఘటన బుధవారం మొలకలచెరువు మండలంలో జరిగింది. బాధితుని కుటుంబ సభ్యుల కథనం మేరకు.. మండలంలోని పెద్దపాలెంగేటుకు చెందిన తిరుపాల్ కుమారుడు చిన్న భవన కార్మికుడిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇతనికి భార్య లక్ష్మీదేవి ఉండగానే అదే ప్రాంతానికి చెందిన లక్ష్మీదేవిని రెండో వివాహం చేసుకున్నాడు. ఇద్దరు భార్యలకు ఆరు మంది పిల్లలు ఉన్నారు. చిన్న గతకొంత కాలంగా భార్య పిల్లలను సక్రమంగా పట్టిం చుకోకుండా, ఇంట్లోకి ఏమి తెచ్చివ్వకపోవడంతో రెండో భార్య లక్ష్మీదేవి నిలదీసింది. పోషిం చడం చేతకాకపోతే విడాకులిచ్చేయమని గొడవ పడింది. తీవ్ర మనస్తాపానికి గురైన చిన్న పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యు లు బాధితున్ని మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆస్పత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నారు. ములకలచెరువు పోలీసులు విచారిస్తున్నారు.

సోలార్ వైర్లు చోరీ : కేసు నమోదు

ప్రజాశక్తి-గాలివీడు : మండలంలోని తూముకుంట సోలార్‌లో వెయ్యి మీటర్ల సోలార్ వైర్లు గుర్తు తెలియని వ్యక్తులు దోచుకెళ్లారని సోలార్ యాజమాన్యం ఫిర్యాదు చేసినట్లు ఎఎస్ఐ వెంక టేశ్వర్లు తెలిపారు. వెయ్యి మీటర్ల వైరు విలువ రూ.70వేలు ఉంటుందని తెలిపారి చెప్పారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు తెలిపారు.

టమోటా లారీ బోల్తా : తప్పిన పెనుప్రమాదం

ప్రజాశక్తి-తంబళ్లపల్లి : మండలంలోని గోపిదిన్నె సమీపంలో టమాటాల లోడుతో వెళ్తున్న లారీ బోల్తా పడి 730 బాక్సుల టమాటాలు రోడ్డు పాలయ్యాయి. ఉప్పులూ రివాండ్లపల్లె నుంచి టమోటా లోడుతో ములకలచెరువు మార్కెట్‌కు వెళ్తుండగా ఘటన జరిగింది. స్వల్ప గాయలతో డ్రైవర్, రైతు బయటపడ్డారు. చుట్టుపక్కల పొలాల రైతులు రోడ్డు పైకి కంచె వేయడం వల్ల రోడ్డు అంచనా తెలియక తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని పలువురు పేర్కొన్నారు.

భార్యపై భర్త హత్యాయత్నం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లిలో భార్యపై భర్త సల సలా కాలే సాంబారు మీద పోసి హత్యా యత్నానికి పాల్పడ్డాడు. బుధవారం సాయంత్రం మదనపల్లెలో జరిగిన ఘటనపై బాధితురాలు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని కురవంకలో నివాసమున్న రామాంజులు భార్య భారతి జిల్లా ఆస్పత్రిలో రోగులకు డైట్ సరఫరా చేసే వీరభద్ర దగ్గర పనిచేస్తున్నారు. ఈ క్రమంలో సాయంత్రం విధులకు హాజరైన భార్యపై అనుమానం పెంచుకొన్న భర్త ఆస్పత్రి లోనే భార్యతో గొడవపెట్టుకున్నాడు. ఈ క్రమంలో ఆగ్రహించిన భర్త కాలే సాంబారును మీద పోసి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు వెంటనే బాధితురాలిని ప్రభుత్వ ఆసుపత్రి లో చేర్పించారు. పరీక్షించిన వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. రెండవ పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భర్త ఇంటి ముందు భార్య దీక్ష

ప్రజాశక్తి-నందలూరు : మండలంలోని పాటూరు గ్రామంలో భర్త అన్న ఇంటి ముందు భార్య దీక్ష చేసిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. బాధితురాలి వివరాల మేరకు.. ఓబులవారిపల్లి మండలం ఎల్లాయపల్లి గ్రామానికి చెందిన జయ లక్ష్మికి మండలం లోని పాటూరు గ్రామానికి చెం దిన కుంచం సురేష్‌తో ఏనిమిదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు సంతానం. సురేష్ జీవనోపాధి నిమిత్తం గల్ఫ్ దేశాలకు వెళ్లి వస్తుంటాడు. సురేష్ ఇతర దేశాల్లో ఉండడం వల్ల జయలక్ష్మి తన పుట్టింట్లో నివసిస్తుంది. తన భర్త మామగారి ఆస్తి కావాలని గొడవ పెట్టుకుని ఆరు నెలల నుంచి డబ్బులు పంపడం లేదని, మాట్లాడటం లేదని జయలక్ష్మి చెబుతోంది. నెల రోజుల క్రితం తన భర్త ఇంటికి వచ్చిన విషయం తెలిసి ఫోన్ చేయగా ఆస్తిలో సగం భాగం తనకు ఇస్తేనే సంసారానికి తీసుకొని వస్తానని లేకుంటే లేదని చెప్పి ఫోన్ పెట్టేశాడని ఆవేదన వ్యక్తం చేసింది. పాటూరు గ్రామానికి వచ్చి పిల్లలతో కలిసి తన భర్త సురేష్ అన్న కుంచం గోపాలకృష్ణయ్య దీక్ష చేపట్టినట్లు తెలిపారు. తన భర్త సోదరుడి వల్లే తమ మధ్య గోడవలు వచ్చాయని తెలిపింది. తన భర్త తనకు కావాలని న్యాయం చేయాలని బాధితురాలు కోరుకుంటోంది.

భర్త సురేష్ సోదరుడి ఇంటి ఎదుట పిల్లలతో కలిసి దీక్ష చేస్తున్న జయలక్ష్మి